ఏడాదిలో వైద్య కళాశాలల భవనాలు పూర్తి

- వైద్యారోగ్యానికి నిధులు పెంచుతాం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఏడాదిలోగా వైద్య కళాశాలల భవనాలతోపాటు దవాఖానాలకు సంబంధించిన నిర్మాణాలు పూర్తి అవుతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో ఇద్దరు మంత్రులు పాల్గొన్నారు. వైద్యారోగ్య శాఖకు నిధుల కేటాయింపు అంశంపై చర్చించారు. పేద, మధ్య తరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్యారోగ్య శాఖకు ప్రాధాన్యం కల్పిస్తామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి వచ్చే బడ్జెట్‌లో సమృద్ధిగా నిధులు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కిష్టియాన చొంగతా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, జాయింట్ సెక్రటరీ హరిత పాల్గొన్నారు.

సోలార్ ఫెన్సింగ్‌తో పంటలకు రక్షణ

ఉద్యానవన అధికారుల సమీక్షలో మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): సోలార్ ఫెన్సింగ్ పథకంతో పంటలకు రక్షణ కలుగుతుందని, దీనిని అమలుచేసే ఆలోచన చేస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం ఉద్యానశాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. సోలార్ ఫెన్సింగ్ స్కీం అమలవుతున్న హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో పర్యటించి, ప్రభుత్వం తరపున సబ్సిడీపై అందజేసేందుకు విధివిధానాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరానికి 100 కిలోమీటర్ల పరిధిలో కూరగాయల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ కోసం దరఖాస్తులు స్వీకరించి.. గ్రౌండింగ్ మొదలుపెట్టాలన్నారు.

పకడ్బందీగా భూభారతి చట్టం రూపకల్పన

అధికారులను ఆదేశించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ , ఫిబ్రవరి18(నమస్తే తెలంగాణ) : భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా.. పకడ్బందీగా భూభారతి చట్టం విధివిధానాలను రూపొందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకొని భూభారతిని సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నూతన చట్టం భూ యాజమాన్య హక్కులే కాకుండా.. వారి జీవితాల్లో ఆత్మగౌరవం, ఆర్థిక స్వతంత్ర్యాన్ని తీసుకువస్తుంది" ధీమా వ్యక్తం చేశారు.

తాగునీటి స్థిరీకరణకు నిధులివ్వండి

కేంద్రానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాగునీటి స్థిరీకరణకు నిధులు విడుదల చేయాలని కేంద్రానికి రాష్ట్ర పంచాయతీరాజ్, మిషన్ భగీరథశాఖల మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మంగళవారం నిర్వహించిన ఇండియా-2047 వాటర్ సెక్యూర్ సదస్సుకు హాజరై ఆమె మాట్లాడారు. తెలంగాణలో ఏటా సుమారు రూ. 5 వేల కోట్లు వెచ్చించి ఇంటింటికీ సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. స్థిరీకరణ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నీతి ఆయోగ్ సిఫారసు మేరకు రూ.16 వేలకోట్లు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు మంత్రి మిషన్ భగీరథ, ఇతర తాగునీటి పథకాలను పీపీటీ ద్వారా వివరించారు.

కేసీఆర్‌కు పేరొస్తదా..డాటా డిలీట్!

- వెబ్‌సైట్ల నుంచి రిపోర్టుల తొలగింపు
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనా ప్రగతిని తొక్కిపెట్టే కుట్రలు
- నాటి పురోగతిని ప్రతిబింబించే ఫొటోలు, వీడియోలు, డిజిటల్ కంటెంట్ మాయం
- గతంలో ఎస్‌కేఎస్ నివేదిక డిలీట్
- తాజాగా రాష్ట్ర గణాంక నివేదిక-2024
- తొక్కిపెడుతున్న రేవంత్‌రెడ్డి సర్కారు
- డిజిటల్ ఆస్తుల ధ్వంసంపై దర్యాప్తు చేయండి
- సీఎస్‌కు బీఆర్ఎస్ నేత దిలీప్ వినతి



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ నివేదికలు ఒక్కొక్కటిగా వెబ్‌సైట్ల నుంచి మాయమవుతున్నాయి. బీఆర్ఎస్ పాలన, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పేరొచ్చేలా ఉన్న రిపోర్టులు రాత్రికి రాత్రే డిలీట్ అవుతున్నాయి. కొన్ని వెబ్‌సైట్లు ఓపెన్ కూడా కావడం లేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం విడుదల చేసిన రాష్ట్ర గణాంక నివేదిక-2024 కూడా కనిపించడం లేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నివేదిక కూడా వెబ్‌సైట్ నుంచి ఇప్పటికే డిలీట్ అయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర సంస్థలు గత పాలన, ప్రస్తుత పాలనకు సంబంధించిన నివేదికలను విడుదల చేస్తాయి. ప్రతి నివేదికలోనూ కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన అద్భుతమని వెల్లడవుతున్నది. దీనిని ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కారు జీర్ణించుకోలేకపోతున్నది. నాటి కేసీఆర్ పాలనా ప్రగతి, ప్రస్తుత ఏడాది పాలనా వైఫల్యం గణాంకాలతోసహా బహిర్గతమైతే కాంగ్రెస్ సర్కారు అసమర్థత ప్రజలకు తెలిసిపోతుందని భయపడుతున్నట్టు తెలుస్తున్నది. కేసీఆర్ చరిత్రను చెరిపేస్తామని గతంలో రేవంత్ చెప్పినట్టుగా డిజిటల్ కంటెంట్‌ను కొన్ని అదృశ్య శక్తులు కనిపించకుండా చేస్తున్నాయి.

పదేండ్ల అభివృద్ధికి అద్దంపట్టాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం విడుదల చేసిన రాష్ట్ర గణాంక నివేదిక-2024 కేసీఆర్ పాలనలో జరిగిన పదేండ్ల అభివృద్ధికి అద్దంపట్టింది. 2014-15లో రూ.5,05,849 కోట్లుగా ఉన్న తెలంగాణ జీఎస్‌డీపీ 2023-24లో 196 శాతం వృద్ధితో రూ.15,01,981 కోట్లుగా నమోదైనట్టు నివేదిక వెల్లడించింది. దేశ జీడీపీ, తలసరి ఆదాయం, ధాన్యం ఉత్పత్తి, సాగు విస్తీర్ణం వంటి అంశాల్లో గణనీయ అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రం సాధించింది. స్పష్టమైన గణాంకాలతో ఉన్న ఆ నివేదిక తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ (అట్లాస్) వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించింది. గతంలో ఎన్నడూలేని విధంగా 36 గంటల వ్యవధిలోనే ఎస్‌కేఎస్ జరిపింది. దాని ఆధారంగా పథకాలు అమలుచేసి ప్రజలకు న్యాయం చేసింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన కులగణన సర్వే లెక్కలు ఎస్‌కేఎస్, ఎన్నికల కమిషన్ ఓటరు లిస్టుతో పోల్చినప్పుడు జనాభా భారీగా తగ్గింది. ఎస్‌కేఎస్ సర్వే రిపోర్టుతోనే తమ వైఫల్యం, బండారం బయటపడిందని ప్రభుత్వం భావించినట్టున్నది. అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ప్రసంగం తర్వాత నుంచి ఎస్‌కేఎస్ నివేదిక వెబ్‌సైట్‌లో కనిపించకుండా పోయింది.

అట్లాస్ నివేదిక అందుబాటులో పెట్టండి: బీఆర్ఎస్

తెలంగాణ ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ (అట్లాస్).. వెబ్‌సైట్ (tgdps.telangana.gov.in)లో కనిపించడం లేదని, మంగళవారం ఎంత ప్రయత్నించినా యాక్సెస్ కాలేదని బీఆర్ఎస్ నేత కొణతం దిలీప్ తెలిపారు. నివేదికను ప్రజలకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు. 'తెలంగాణ సిద్ధించిన తొలి దశాబ్దంలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అద్భుతమైన పురోగతి సాధించింది. అనేక రిపోర్టులు కేసీఆర్ పాలనా తీరుకు అద్దంపట్టాయి. అలాంటి నివేదికలు నేడు వైబ్‌సైట్లలో కనిపించడం లేదు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. కొన్ని అనైతిక శక్తులు వాటిని కనిపించకుండా చేసినట్టు అనిపిస్తున్నది. 2014-2023 మధ్య కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో వచ్చిన పురోగతిని ప్రతిబింబించే వేలల్లో ఉన్న ఫొటోలు, వీడియోలు, ఇతర డిజిటల్ కంటెంట్‌ను, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి తొలగించారు. ఈ ప్రభుత్వ డిజిటల్ ఆస్తుల ధ్వంసంపై విచారణ జరిపించండి' అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని దిలీప్ కోరారు.

కేసీఆర్ పాలనాదక్షతకు నిదర్శనం

ఏ లక్ష్యంతో అయితే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామో 2014-23 మధ్య కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆ దిశగానే అడుగులు వేసింది. రాష్ట్రం సొంత ఆదాయాన్ని పెంచుకున్నది. 2014-15లో రూ.29,288 కోట్లు ఉంటే 2021-22 నాటికి రూ.92,910 కోట్లు పెరిగింది. సొంత రాబడిలో మూడు రెట్లు పెరిగి దేశంలోనే అగ్రపథాన నిలిచింది. రాష్ట్ర తలసరి ఆదాయం రెండున్నర రెట్లు పెరిగింది. 2013-14లో ఉన్న రూ.1,12,162 కోట్ల నుంచి 2021-22 నాటికి రూ.2,75,445 కోట్లకు పెరిగింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వ్యవసాయం, ఐటీ, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక తదితర రంగాలు ఉన్నత శిఖరాలకు చేరాయి. ఈ విషయాన్ని వివిధ నివేదికలు గణాంకలతో సహా వెల్లడించాయి. పదేండ్ల కేసీఆర్ పాలనా ప్రగతి రాకెట్‌లాగా పైకి దూసుకెళ్తే, ఏడాది రేవంత్‌రెడ్డి పాలనలో రియల్ ఎస్టేట్, వాణిజ్యం, పన్నుల రాబడి, రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా తగ్గింది. ఈ గణాంకాలన్నీ డిజిటల్ రూపంలో ఆయా శాఖల వెబ్‌సైట్లలో ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వానికి పేరు తెచ్చేలా ఉన్న నాడు పొందుపర్చిన తెలంగాణ ప్రగతి నివేదికలను ఈనాడు వెబ్‌సైట్ల నుంచి తొలగిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా నల్లవల్లి వద్ద హైవేపై ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు

అట్టుడికిన ప్యారానగర్, నల్లవల్లి

- ఉద్రిక్తంగా మారిన నల్లవల్లి హైవే
- ఆందోళనకు ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి మద్దతు
- ప్యారానగర్ డంపింగ్‌యార్డు సమీపంలో కొత్తపల్లి, నల్లవల్లి గ్రామస్థుల ఆందోళన

గుమ్మడిదల, ఫిబ్రవరి 18: ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేస్తున్న ఆందోళనలు మంగళవారం మరింత ఉద్రిక్తంగా కొనసాగాయి. మంగళవారం నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామస్థులు, రైతు జేఏసీ నాయకులు ట్రాక్టర్లపై ర్యాలీగా డంపింగ్‌యార్డు నిర్మాణం చోటుకు బయలుదేరారు. వారిని మార్గమధ్యంలో పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకున్నది. పోలీసులు బలవంతంగా వెనక్కి పంపడంతో బాధిత గ్రామాల ప్రజలు హైవేపై నిరసనకు దిగి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుపై రేవంత్ సర్కారు మొండిగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహిస్తూ గుమ్మడిదలలో జాతీయ రహదారి-765డీపై బతుకమ్మ ఆడిపాడి నిరసన తెలిపారు.

కాంగ్రెస్‌ది రాక్షస పాలన : శేరి

ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. రాక్షస పాలన కొనసాగిస్తున్నదని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి మండిపడ్డారు. అటుగా వెళ్తున్న ఆయన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్న నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంత దుర్మార్గమైన పాలకులను ఎప్పుడూ చూడలేదని అన్నారు. కాగా గుమ్మడిదలలో కొనసాగుతున్న రిలే దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం నాటి శిబిరంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొని డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పచ్చని పల్లెల్లో డంపు యార్డా? : చుక్క రాములు

గుమ్మడిదలలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాంటూ ఈనెల 20న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో దీక్ష చేపడతామని తెలిపారు.

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్థులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

పేదోడి కడుపు మాడ్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- జీహెచ్ఎంసీలో 23 అన్నపూర్ణ కేంద్రాల ఎత్తివేత
- 127 కేంద్రాల్లోనే రూ.5 భోజనం
- తగ్గిన నాణ్యత.. ఆపై అపరిశుభ్రత

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): అన్నపూర్ణ కేంద్రాలపై జీహెచ్ఎంసీ శీతకన్ను వేసింది. కేసీఆర్ హయాంలో దేశంలోనే అతిపెద్ద పథకంగా నిలిచిన పేదల అక్షయపాత్రను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలోని 150 డివిజన్లలో 150 అన్నపూర్ణ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం అధికారులు 23 సెంటర్లను ఎత్తివేశారు. ఒక్కో సెంటర్ ద్వారా రోజుకు 300 మందికి చొప్పున 150 కేంద్రాల ద్వారా 45 వేల భోజనాలు అందించాల్సి ఉండగా, ప్రస్తుతం 127 సెంటర్ల ద్వారా దాదాపు రూ.30వేల మందికి మాత్రమే భోజనాలు అందిస్తున్నారు. సగటున రోజుకు ఒక కేంద్రం ద్వారా 250 భోజనాలు అందిస్తుండగా, ఏడాదికి రూ.25 కోట్ల మేర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు.

కేసీఆర్ హయాంలో 216 కోట్లు వ్యయం

కేసీఆర్ సంకల్పంతో 2014లో ప్రారంభమైన 5 రూపాయలకే భోజనం పథకం విజయవంతంగా కొనసాగుతూ వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో 10 కోట్ల 88 లక్షల మందికిపైగా భోజనం అందించి దేశంలోనే అతిపెద్ద భోజన పథకంగా నిలిచింది. ఇందు కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.216.01 కోట్లు వెచ్చించింది. వివిధ చిన్నచిన్న వృత్తులవారితో పాటు విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్నపూర్ణ పథకం వరప్రసాదంగా నిలిచింది. 15 అన్నపూర్ణ క్యాంటీన్లలో సిట్టింగ్ ఏర్పాటు చేసి ప్రైవేట్ భోజనశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా అన్నపూర్ణ కేంద్రాలను తీర్చిదిద్దారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 18 పెద్ద ప్రభుత్వ దవాఖానలు ఉండగా, 17 దవాఖానల్లో రూ. 5లకే భోజనం అందిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీ అన్నపూర్ణ సెంటర్ల నిర్వహణను గాలికి వదిలేసింది. 23 సెంటర్లను ఎత్తివేయగా మిగిలి 127 సెంటర్లలో చాలావరకు అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. సెంటర్ల పక్కనే చెత్త, చెదారం పోగుబడి దుర్వాసన వస్తున్నదని చెప్తున్నారు. భోజనం క్వాలిటీ కూడా పడిపోయిందని చెప్తున్నారు. ప్రతి కేంద్రం నుంచి 300 వరకు భోజనాలు అందించాల్సి ఉండగా కేవలం 230 మించడం లేదని మింట్ కాంపౌండ్ సెంటర్ల వద్ద పలువురు అభిప్రాయాలు వ్యక్తంచేశారు. అధికారులు మాత్రం అన్నపూర్ణ కేంద్రాలను పునరుద్ధరిస్తున్నామని చెప్తున్నారు.

ఈసారి రంజాన్ తోఫా లేనట్టే!

గత సంప్రదాయాన్ని విస్మరించిన సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): రంజాన్ పర్వదినం సందర్భంగా నిరుపేద ముస్లింలకు ప్రభుత్వం తరపున రంజాన్ తోఫా(బహుమతి) ఇచ్చే సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈయేడు తుంగలో తొక్కింది. సచివాలయంలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన రంజాన్ ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో రంజాన్ తోఫా గురించి ఊసేత్త లేదు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ సహా ఇతర ప్రజాప్రతినిధులు కూడా రంజాన్ తోఫాపై మౌనం వహించారు. స్వరాష్ట్రంలో నిరుపేదలు పండుగలు ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ వివిధ పండుగలకు ప్రభుత్వం తరపున బహుమతులు ఇచ్చే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ.. రంజాన్, క్రిస్మస్‌లకు క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫాలను అందించారు. ఈసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ సంప్రదాయాన్ని విస్మరించింది. రంజాన్ తోఫా వల్ల అనేకమంది నిరుపేద ముస్లింలు కనీసం పండుగ రోజైనా కొత్త దుస్తులు ధరించే వారని.. ఇప్పుడు ఆ సంప్రదాయాన్ని పాటించకపోవడం వల్ల ఆ అవకాశం లేకుండాపోతుందని ముస్లిం మత పెద్దలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తరుపున రంజాన్ తోఫా అందించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కేసు వాదిస్తూ న్యాయవాది హఠాన్మరణం

- హైకోర్టులో విషాద ఘటన

హైదరాబాద్, ఫిబ్రవరి 18, నమస్తే తెలంగాణ: తెలంగాణ హైకోర్టులో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకున్నది. న్యాయవాది పసునూరు వేణుగోపాలరావు తన కేసులో వాదనలు వినిపిస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో హాలులో ఉన్నవారంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ విషయాన్ని గమనించిన ఇతర న్యాయవాదులు ఆయన్ని వెంటనే పైకిలేపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయనను హుటాహుటిన అంబులెన్స్‌లో ఉస్మానియా దవాఖానకు తరలించారు. అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని హిల్‌కాలనీలో వేణుగోపాలరావు నివాసం ఉంటున్నారు. అప్పటివరకు తమతో ఉన్న న్యాయవాది మరణించడంతో న్యాయవాదులు, బెంచ్‌పై ఉన్న న్యాయమూర్తి నిర్ఘాంతపోయారు. ఈ ఘటన అనంతరం కేసుల విచారణను ముగించి న్యాయమూర్తి బెంచ్ దిగి వెళ్లిపోయారు. న్యాయవాది ఆకస్మిక మరణ వార్త తెలియగానే ఇతర కోర్టులు కూడా అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశాయి. న్యాయవాది వేణుగోపాలరావు ఒక కేసు విచారణ సమయంలో 21వ కోర్టు హాలులో న్యాయమూర్తి ముందు వాదనలు వినిపిస్తున్నారు.

సైబర్ నేరాలు ఆర్థిక వ్యవస్థకు ముప్పు

- తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలి
- షీల్డ్-2025 కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- డీప్ ఫేక్ దుర్వినియోగంపై కఠిన చర్యలు : మంత్రి దుద్దిళ్ల
- నిరుడు 183 కోట్లు వెనక్కి తెప్పించాం: డీజీపీ జితేందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు దారుణంగా పెరిగిపోతున్నాయని, ఆర్థిక వ్యవస్థకు, పౌరులకు పెను ముప్పుగా మారాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. గత సంవత్సరం ఇండియా నుంచి రూ.22,812 కోట్లు కొట్టేశారని, ఒక్క తెలంగాణలోనే 1,20,869 మంది సైబర్ నేరాల బారినపడ్డారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షీల్డ్-2025' కాంక్లేవ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణ ముందున్నదని, కేంద్రం ఎన్నోసార్లు మన అధికారులను అభినందించిందని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం నిపుణులు, ఐటీ సంస్థలతో కలిసి పనిచేయడానికి అన్ని రకాల వనరులు సమకూరుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలని సీఎం ఆకాంక్షించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు.

డీప్ ఫేక్ దుర్వినియోగంపై చర్యలు

ప్రపంచవ్యాప్తంగా డీప్ ఫేక్ సమస్య తీవ్రంగా మారుతున్నదని, ఏఐ టూల్స్‌ను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వం సైబర్ నేరాల నియంత్రణకు కట్టుబడి ఉన్నదని చెప్పారు. డీప్ ఫేక్ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ బెదిరింపుల నుంచి పోలీసు విభాగాలు, ప్రభుత్వ సంస్థలను ముందస్తుగా రక్షించడానికి తెలంగాణ సైబర్ డిఫెన్స్ సెంటర్ (టీజీసీడీసీ)ను స్థాపించడానికి చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. 2024లోని 18 వేల మంది సైబర్ బాధితులకు రూ.183 కోట్లను తిరిగి అందించినట్టు పేర్కొన్నారు. సైబర్ భద్రతా చట్టాలను బలోపేతం చేయడం అత్యవసరమని హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా చెప్పారు. సైబర్ సెక్యూరిటీ పరిశోధన, విధాన సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధిలో భవిష్యత్ సహకారాల కోసం షీల్డ్-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందుకు ఐఐటీ హైదరాబాద్, నల్సార్, ఐఎస్‌బీతో ఎంవోయూ కుదుర్చుకున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్ ప్రకటించారు.

విలేకరి ముసుగులో 31.5 లక్షలకు టోకరా

- ఎస్సారెస్పీలో ముంపులో పోయిన భూమికి పట్టా చేయిస్తానని భారీగా డబ్బులు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు రాజమల్లయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 18 : విలేకరి ముసుగులో ఓ వ్యక్తి అర్చకుడిని నిలువునా ముంచాడు. ఎస్సారెస్పీలో పోయిన భూమి పట్టా చేయిస్తానని రూ.31.50 లక్షలు వసూలు చేసి, నకిలీ ప్రొసీడింగ్ చేతిలో పెట్టాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు.. మానకొండూర్ మండలం పచ్చునూర్‌కు చెందిన వైరాగ్యపు రాజమల్లయ్య అనే అర్చకుడు మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి, ఊటూరు, పచ్చునూరు గ్రామాలు, శంకరపట్నం మండలం చింతగుట్టలో పౌరోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి పచ్చునూర్‌లో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో ఎకరం పహానీకి రావడం లేదు. ఈ క్రమంలో 2023లో శంకరపట్నం మండలం తాడికల్‌కు చెందిన మాచర్ల రాజయ్య తన తల్లి దశదినకర్మ సందర్భంలో అర్చకుడు రాజమల్లయ్యతో పరిచయం ఏర్పరచుకున్నాడు. పహానీకి రాని భూమిని రికార్డులకు ఎక్కిస్తానని ఖర్చుల పేరిట రూ.లక్షకు పైగా వసూలు చేశాడు. రెవెన్యూ అధికారులు ప్రొసీడింగ్ జారీ చేశారని ఓ నకిలీ జిరాక్స్ పత్రాన్ని చేతిలో పెట్టాడు. ఎస్సారెస్పీ కెనాల్ కింద పోయిన వ్యవసాయ భూములకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందని, రూ.96 లక్షల వరకు పరిహారం వచ్చేలా ఉన్నతాధికారులతో చేసి పెడతానని అర్చకుడికి ఆశ చూపాడు. నమ్మిన రాజమల్లయ్య మే 2023 నుంచి డిసెంబర్